క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి

ఎస్‌ఐ రాజశేఖర్



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్

తాండూరు రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కరన్‌కోట్ ఎస్‌ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం తాండూరు మండలం గౌతపూర్ గ్రామ శివారులో ప్రయాణికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకే ముప్పు అన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ అమీనోద్దీన్, కానిస్టేబుళ్లు తిప్పన్న, శాంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలి

రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్‌మాదిగ



సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

పరిగి: ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలని రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్‌మాదిగ పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని శారద గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతీ గ్రామంలో నిర్వహించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా పోరాటం చేసిందని గుర్తు చేశారు. మాదిగలను చైతన్యం చేస్తూ హక్కుల సాధనకు సమిష్టిగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. నాయకులకు, మాదిగలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌మాదిగా, సుభాష్, మల్లికార్జున్, ప్రకాశ్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సంగెంకలాన్‌లో రెవెన్యూ సదస్సులు

తాండూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సోమవారం మండల పరిధిలోని సంగెం కలాన్, నారాయణపూర్, పర్వాతపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తారాసింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఏమైన సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వెంకట్‌ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన్‌సాన్‌పల్లిలో కూడా నిర్వహిస్తారని తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

దుద్యాల్: రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..జూన్ 5వ తేదీ లోపు నూతన రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, దరఖాస్తు ఫారంతో వివరాలు నమోదు చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయలని సూచించారు.

దరఖాస్తుకు వారం రోజులే..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రైతులందరూ దరఖాస్తు చేసుకోవడానికి వారం రోజులే గడువు ఉందని మండల వ్యవసాయాధికారి పోలప్ప తెలిపారు. ఈ ఏడాదికి గానూ కొత్తగా ఈ నెల 5నాటికి భూ భారతి (ధరణి) పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసి, పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20 వరకు సంబంధిత జిరాక్స్ పత్రాలను ఏఈఓలకు అందజేయాలన్నారు.

రైతు వేదికలో..

పూడూరు: కొత్త పాస్‌బుక్కులు వచ్చిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తులసిరాం తెలిపారు. మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్, కంకల్, చన్గోముల్, మంచన్‌పల్లి, పూడూరు క్లస్టర్‌లలోని రైతు వేదికలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బడిబాటతో సంఖ్య పెరిగేనా?

- ఇంటింటా ఉపాధ్యాయుల ప్రచారం
- అన్ని సౌకర్యాలున్నా ఆసక్తి చూపని విద్యార్థులు
- ప్రవేశాలు అంతంతమాత్రమే



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఊరూరా ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడుతున్నారు. పాఠశాలలో చేరాలని అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలోని మౌలిక వసతులను వివరిస్తున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపడుతున్నారు. ఐనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య అంతంత మాత్రంగానే ఉండడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ విద్యార్థులు ఆసక్తి చూపించడం లేదు. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులు చేజారిపోకుండా ఒక దఫా ప్రచారం పూర్తి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట కొనసాగుతుంది. దీంతో విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకునేందుకు ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతున్నారు. తమలోని నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రైవేటు పాఠశాలలకు భిన్నంగా ప్రభుత్వ పాఠశాలలో బోధన, వసతులు కల్పిస్తున్నామంటూ తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయులు స్థానికంగా లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇదే సాకుగా చూపి అన్ని వేళల్లో అందుబాటులో ఉంటామంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకొని అడ్మిషన్లు కొల్లగొడుతున్నారు.

33 పాఠశాలల్లో 56 మంది అడ్మిషన్లు

మండల వ్యాప్తంగా జూన్ 6నుంచి ప్రారంభమైన బడిబాట ఈ నెల 19 వరకు కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఈ నెల 6న నిర్వహించిన బడిబాటలో 33 పాఠశాలల్లో 56 మంది విద్యార్థులను చేర్పించామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇంకా మిగిలిన నాలుగు రోజుల్లో అన్ని గ్రామాల్లో బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

కరపత్రాలతో ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల నైపుణ్యత, పాఠశాలలో వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ వంటి అన్ని విషయాలు వివరిస్తూ విద్యార్థులనూ చేర్చుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాం. ఆయా పాఠశాలల్లోని ప్రత్యేకతలు వివరించి, వాటి గురించి తెలిసేవిధంగా కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నాం. ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

పొంచి ఉన్న ప్రమాదం!

- సాగారం తండాలో తెరుచుకున్న మ్యాన్‌హోల్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్య తెరుచుకున్న మ్యాన్‌హోల్

దుద్యాల్: మండల పరిధిలోని సాగారం తండాలో మ్యాన్‌హోల్ మూత తెరచుకొని ప్రమాదకరంగా మారింది. ఇళ్ల మధ్య సీసీ రోడ్డు వేసినప్పుడు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. కానీ మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దీంతో అది ప్రమాదకరంగా తయారైంది. తండాలో ఇళ్ల మధ్య ఉండడంతో రాత్రి వేళల్లో నడిచే సమయాల్లో చాలా సార్లు గుంతలో పడి గాయాల పాలైనట్లు తెలిపారు. చిన్న పిల్లలు ఆడుకుంటూ ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పలు మార్లు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తండా వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గిరిజనులు కోరుతున్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి



చెక్కు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరమని మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని తండాకు చెందిన రవినాయక్, రెడ్యానాయక్ అనారోగ్యానికి గురై పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం కోసం పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయనిధి కింద రూ.22,500 మంజూరు చేయించి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ..పేదలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

సంఘటితంగా ఎదగాలి

యుగమానోత్సవం జయప్రదం చేయాలి

కొడంగల్ రూరల్: వీరశైవ సంఘం సభ్యులు సంఘటితంగా ఎదిగేందుకు కృషిచేయాలని సమాజం సభ్యులు సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో వీరశైవ సమాజ పట్టణ కమిటీ అధ్యక్షుడు జంగం శాంతుకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గడ్డం చంద్రశేఖర్‌ను పట్టణ పురోహితులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 16వ తేదీన మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న శ్రీ ఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవం, శ్రీబసవేశ్వర జయంతోత్సవం కార్యక్రమాలను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వీరశైవులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్ల ఆశీర్వాదం పొందాలని వారు కోరారు.

వీరశైవ ధార్మిక సేవారత్న అవార్డు..

వీరశైవ ధార్మిక సేవారత్న అవార్డును బుక్క బాలప్రకాశ్‌కు అందించనున్నారని తెలిపారు. పట్టణంలో శ్రీబసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇచ్చిన దాత శేరి బస్వరాజ్ పటేల్‌ను, పట్టణ పురోహితులు గడ్డం చంద్రశేఖర్‌ను, బుక్క బాలప్రకాశ్‌లను సమాజం సభ్యులు ఘనంగా సన్మానం చేశారు.

ముగిసిన రామాయణం వీధి నాటకం

- చివరి రోజు ఆసక్తిగా తిలకించిన గ్రామస్థులు
- రూ.4లక్షలు విరాళం అందించిన నర్సింహా రెడ్డి కుటుంబ సభ్యులు



నాటక పాత్రదారులతో విరాళదాత నర్సింహా రెడ్డి

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్‌లో నిర్వహించిన రామాయణం వీధి నాటకం శనివారం ఉదయం ముగిసింది. ఐదు రాత్రులుగా సాగిన ఈ నాటకానికి విశేష స్పందన వచ్చిందని నాటక సభ్యులు, నాటకోపాధ్యాయుడు వెంకటయ్య గౌడ్ వాపోయారు. దీనికయ్యే పూర్తి ఖర్చులు గ్రామానికి చెందిన సంజీవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బిచ్చి రెడ్డి, నరేందర్ రెడ్డి, నర్సింహా రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి జ్ఞాపకార్థంగా రూ.4 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నాటక సభ్యులందరికీ నర్సింహా రెడ్డి సన్మానం చేశారు. అనతంరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పల్లెల్లో వీధినాటకాలు అంటే పూర్వం ఎంతో ఆదరణ ఉండేదని, సినిమాలు రావడంతో వాటిని చూసే వారి సంఖ్య తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ మల్లి గ్రామాల్లో పూర్వ వైభవం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో వీధి నాటకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. గ్రామాల్లో వీధి నాటకాలు ఆడడం ద్వారా గ్రామానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. గ్రామంలో మహిళలు, యువకులు, యువతులు, వృద్ధులు ఎంతో ఆసక్తిగా వీక్షించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మునుముందు ఇలాంటి వీధి నాటకాలు గ్రామంలో ఆడాలని అందుకు తమ సహాయ సహకారాలు ఉంటాయని గుర్తు చేశారు. చివరి రోజు కావడంతో ఆటను తిలకించడానికి గ్రామస్థులు, చుట్టు పక్కల వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

చాలా ఆనందంగా ఉంది

నా చిన్నతనంలో వీధి నాటకాలకు చాలా ఆదరణ ఉండేది. రాను రాను అవి అంతరించిపోయే దశకు చేరాయి. తిరిగా జీవం పోసుకునేందుకు సహకరిస్తున్నా. గ్రామాల్లో వీధినాటకాలు ప్రదర్శించాలి. మల్లి పల్లెల్లో పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలి. గ్రామాల్లో, పల్లెల్లో వీధి నాటకాలు ప్రదర్శిస్తే ఆదరణ పెరుగుతుంది.

– నర్సింహా రెడ్డి, విరాళ దాత

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

ఏఈ వినయ్‌కాంత్



మోత్కూర్ సమీపంలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

దోమ: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ వినయ్‌కాంత్ తెలిపారు. శనివారం దోమ మండల పరిధిలోని మోత్కూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లు వేలాడుతూ విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కల్గించాయి. దీంతో ఆయన తన సిబ్బందితో వెళ్లి విద్యుత్ వైర్లపై పడ్డ చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్నది వర్షకాలం. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ప్రతి గ్రామ పరిధిలో విద్యుత్ వైర్లపై వేలాడుతున్న కొమ్మలను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రజలకు విద్యుత్‌లో అంతారాయం రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఏ గ్రామంలోనైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే తమకు సమాచారం అందజేయాలని సూచించారు.

రాజ్‌పుత్ మహిళా సంఘం కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నిఖిత, సురేఖ
- తాండూరు పట్టణానికి అర్చన, స్వప్న



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిఖిత, సురేఖ

తాండూరు టౌన్: రాజ్‌పుత్ మహిళా సంఘం జిల్లా, తాండూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులను ఆ సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. శనివారం తాండూరులో నిర్వహించిన ఎన్నిక కార్యక్రమంలో రాజ్‌పుత్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా నిఖిత దిలీప్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా సురేఖ కిషన్ సింగ్‌లు ఎన్నికయ్యారు. తాండూరు పట్టణానికి అర్చన శంకర్ సింగ్, స్వప్న ఉమేష్ సింగ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మహిళా సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని, సంఘం బలోపేతంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

వెలగని వీధిలైట్లు!

- అంధకారంలో అంబేడ్కర్ కాలనీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వీధిలైటు

బొంరాస్‌పేట: మండల పరిధిలో రేగడిమైలారంలోని అంబేడ్కర్ కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదు. గతేడాది కాలంగా సమస్య ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. అక్కడ వీధిలైట్లు వెలగడం లేదు. బల్బులు వేయడం లేదు. అంధకారంలో అంబేడ్కర్ కాలనీ మగ్గుతుంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే విషపురుగుల భయంతో బిక్కుబిక్కుమని ఉంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో అధికారులు స్పందించి వీధిలైట్ల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలకేనా?

బీఆర్ఎస్ ఎస్టీ సెల్ కొడంగల్ అధ్యక్షుడు రాజునాయక్

దుద్యాల్: ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలను కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకే ఇస్తున్నారని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు, సంత్రకుంట తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఇటీవలే పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులకు అప్పగించడం విడ్డురంగా ఉందన్నారు. అధికారులు కూడా ఆ నాయకుల కనుసన్నలోనే పని చేస్తున్నారని, సంక్షేమ పథకాలను పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఆంజనేయులు, తదితరులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మొక్కలు నాటడాన్ని అందరూ తమ బాధ్యతగా భావించాలని, మొక్కలు పెరగడం వల్ల సమీప ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారుతాయని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో పెంచుకోవాలని, అధికారులు గ్రామపంచాయతీ పరిధిలో అవకాశం ఉన్న చోట మొక్కలు నాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోశ్, స్థానికులు అంబు, ఉపాధ్యాయులు రాఘవేందర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి తెల్లవారు జాము నుంచి అభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రియల్ ఎస్టేట్ మిత్రబృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

యువతను, నాయకులను అభినందించిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునితాసంపత్



రక్తదాన శిబిరంలో సునితసంపత్, డాక్టర్ సంపత్‌కుమార్‌లు

తాండూరు: రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం తాండూరు బీవీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలాజీ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి వైద్య బృందం చేరుకొని రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునిత సంపత్, డాక్టర్ సంపత్‌కుమార్‌లు, యువకులు, స్థానిక నాయకులు హాజరై రక్తదానం చేశారు.

సాగులో ఆదర్శంగా నిలుపుతాం

మర్పల్లి: జిల్లాలో సిరిపూరం గ్రామాన్ని ఆయిల్ పామ్‌తోటల సాగులో ఆదర్శంగా నిలుపుతామని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సిరిపూరం రైతువేదికలో శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్‌తోటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపే రైతులకు పలు రాయితీలు ఇస్తుందన్నారు. ఇందుకు గాను సిరిపూరం గ్రామంలో బావులు, బోర్లు కలిగిన రైతులతో 100 ఎకరాల్లో పంట సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రభుత్వ పరంగా మార్కెటింగ్ సౌకర్యం, ఇతరత్రా అవకాశాలను కల్పిస్తుందన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనల ప్రకారం పంట సాగుచేసి అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అంతకు ముందు శాస్త్రవేత్త డాక్టర్ శ్రీరంగాయాగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆయిల్ పామ్‌తోటల సాగుకు ముందకు రావడంతో జిల్లాలోనే సిరిపూరం గ్రామాన్ని మేఘా ఆయిల్ పామ్ గ్రామంగా ప్రభుత్వం గుర్తించనుందన్నారు. రైతు సంఘాల నాయకులు మర్రి రాజీరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల హెల్త్ క్యాంప్

షాబాద్: పుట్టిన ఆరు సంవత్సరాలలోపు పిల్లల్లో ఆలోచన, జ్ఞాపకశక్తి, భాష సమస్య పరిష్కార నైపుణ్యాలను తెలుసుకోవడానికి స్కానింగ్ చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెళ్లిలో మైక్రోసాఫ్ట్ వారి సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, చందనవెళ్లి వీడీసీ అడ్వైజర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఇందులో 60 మంది పిల్లలకు టెస్టులు చేసి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రావణ్‌కుమార్, శ్రీదేవి, యశ్వంత్, సుబ్బారావు, గ్రామ వీడీసీ సభ్యులు శ్రీకాంత్, వెంకటేశ్, యునైటెడ్ వే ఆఫ్ సంస్థ ప్రతినిధులు మహేశ్వరి, లక్ష్మీనారాయణ, రవితేజ, సద్దాం హుస్సేన్, హేమంత్‌కుమార్, శ్రీనివాసులు, పవన్‌కుమార్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.